

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

జగిత్యాలజోన్: పొలాస వ్యవసాయ కళాశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను విద్యార్థులు సన్మానించారు.



23 గేట్ల ద్వారా నీటి విడుదల

జగిత్యాలఅగ్రికల్చర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 23 గేట్లను ఎత్తి 74,245 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి 1,01,866 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0/20.0

ఆకాశం మేఘావృతం అవుతుంది. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు కొనసాగుతాయి.

వినూత్నం.. విజ్ఞానం

- నూతనంగా ఆలోచిస్తున్న ఉపాధ్యాయులు
- విభిన్న బోధనలతో ఆకట్టుకుంటున్న వైనం
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ఉత్తమ అవార్డులకు పలువురి ఎంపిక
- నేడు టీచర్స్ డే



అమ్మ జన్మనిస్తుంది.. నాన్న జీవితాన్ని ఇస్తాడు. ఆ జీవితాన్ని సక్రమ దారిలో నిలబెట్టే ఏకైక వ్యక్తి గురువు. బుడిబుడి అడుగులు వేస్తూ ఓనమాలు దిద్దే వయసు నుంచి డిగ్రీ, పీజీలు పూర్తిచేసి ఉద్యోగం, వ్యాపారంలో స్థిర పడే వరకు మార్గదర్శిగా నిలుస్తారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పాఠశాల, కళాశాల, యూనివర్సిటీల్లోని గురువులు వినూత్నంగా విద్యాబోధన అందిస్తున్నారు. పుస్తకాల్లోని పాఠాలను అర్థమయ్యే రీతిలో ప్రత్యక్షంగా వివరిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. ప్రపంచీకరణ వేగాన్ని అందుకునే విధంగా సలహాలు.. సూచనలు ఇస్తూ.. విద్యార్థులు వివిధ రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నారు. వివిధ రకాల ప్రయోగాలు చేయిస్తూ.. జాతీయస్థాయిలో పేరుపొందేలా ప్రోత్సహిస్తున్నారు. ఇలా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని పలువురు పాఠశాల ఉపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులు ఉత్తమ గురువులుగా ప్రశంసలు పొందుతున్నారు. నేడు దేశ తొలి ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనాలు..



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు విద్యార్థి ఆవిష్కరణను వివరిస్తున్న సంపత్ కుమార్(ఫైల్)

మిషన్- 100 లక్ష్యంగా

సిరిసిల్ల ఎడ్యుకేషన్: పుస్తకాల్లో ఉన్న విజ్ఞానాన్ని విద్యార్థులకు బోధించడం పరిపాటి. కానీ మిషన్-100 లక్ష్యంగా విద్యార్థులతో నూతన ఆవిష్కరణలు చేయిస్తున్నాడు రాజన్న సిరిసిల్ల జిల్లా దమ్మన్నపేట జిల్లా పరిషత్ హైస్కూల్ భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడు తాడూరి సంపత్‌కుమార్. తన ఉద్యోగ విరమణలోపు కనీసం 100మంది గ్రామీణ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఆవిష్కరణకర్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో మిషన్-100 కార్యక్రమం నిర్వహిస్తున్నాడు. ఇప్పటివరకు 61మంది వివిధ ఆవిష్కరణలు ప్రదర్శించగా.. వీరిలో 8మంది అంతర్జాతీయస్థాయి, 16మంది జాతీయస్థాయి, 30మందికి పైగా రాష్ట్రస్థాయి బహుమతులు గెలుచుకున్నారు. 2021, 2023లో ఇద్దరు విద్యార్థుల ఆవిష్కరణలు హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాయి. బోష్, ఎన్ఐఎఫ్, టీజీఐసీ సంస్థలు పిల్లల ఆవిష్కరణలకు పేటెంట్ హక్కులు పొందేందుకు సహకారం అందిస్తున్నాయి. సంపత్ కుమార్ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 2024లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందించింది.



ప్రధానోపాధ్యాయురాలు స్వప్న

విద్యార్థుల్లో ఒకరిగా ఫ్రెండ్లీ బోధన

కాల్వశ్రీరాంపూర్: విద్యార్థుల్లో ఒకరిగా ఫ్రెండ్లీ బోధనతో వినూత్నంగా ఆలోచిస్తున్నారు ఉపాధ్యాయురాలు కోయాల్కర్ స్వప్న. 13 ఏళ్లుగా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని వివిధ పాఠశాలల్లో విద్యాబోధన చేస్తున్నారు. ప్రస్తుతం కాల్వశ్రీరాంపూర్ ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎంగా కొనసాగుతున్నారు. 2008లో శంకరపట్నం మండలం రాజాపూర్‌లో విధులు ప్రారంభించారు. ముస్తాబాద్ మండలం కొండాపూర్, కాల్వశ్రీరాంపూర్ మండలం మల్యాలలో పనిచేశారు. ఉత్తమ విద్యాబోధన, విద్యార్థులతో ఫ్రెండ్లీగా ఉంటూ ఆటపాటలతోపాటు కృత్యాధారణ బోధన (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) చేస్తూనే మండలస్థాయిలో నిర్వహించే ఎఫ్ఎల్ఎస్‌లో రిసోర్స్ పర్సన్‌గా ప్రశంసలు అందుకుంటున్నారు. కాల్వశ్రీరాంపూర్ ఎస్సీ కాలనీకి గతేడాది బదిలీపై వచ్చిన స్వప్న 50మంది నుంచి 60మందికి విద్యార్థుల సంఖ్యను పెంచారు.

-మరిన్ని కథనాలు 8లో▸

మూఢనమ్మకాలపై అవగాహన



పర్లపల్లి రాజు

జగిత్యాల: జిల్లాకేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం అధ్యాపకుడు.. ఎన్‌సీసీ అధికారి పర్లపల్లి రాజు రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపికయ్యారు. 14 ఏళ్లుగా ఎన్‌సీసీ అధికారిగా అనేక గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నారు. వ్యాధులు, మూఢనమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. రక్తదాన శిబిరాలతోపాటు రక్తదానంపై వివరిస్తున్నారు. హరిత హారంలో భాగంగా ఏటా గ్రామాల్లో వందలాది మొక్కలు నాటారు. కాకతీయ వర్సిటీలో పసుపు పంటలపై కీటకాల వైవిధ్యంపై ప్రొఫెసర్ వెంకటయ్య ఆధ్వర్యంలో పరిశోధన చేశారు. వర్సిటీలో సమర్పించి మూడు పేటెంట్ హక్కులు పొందారు. ఎన్‌సీసీ లెఫ్టినెంట్ అధికారిగా ఐదేళ్లుగా క్యాడెట్లను త్రివిధ దళాలు, పోలీసుశాఖలో ఉద్యోగాలు సాధించేలా కృషి చేశారు. ఈయనకు అవార్డు రావడంపై ప్రిన్సిపల్ అశోక్ మాట్లాడుతూ.. ముున్ముందు మరిన్ని అవార్డులు, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, సాయిమధుకర్, గోవర్ధన్, సురేందర్, అభినందించారు.

సామాజిక సేవకుడు గొల్లపల్లి గణేశ్



గొల్లపల్లి గణేశ్

సారంగాపూర్/ధర్మపురి: ధర్మపురికి చెంది.. బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారం పాఠశాలలో తెలుగు (స్కూల్ అసిస్టెంట్) ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గొల్లపల్లి గణేశ్ పదేళ్లుగా బోధనతోపాటు అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. స్టూడెంట్ అడాప్షన్ ప్రోగ్రాం ద్వారా 4వేల మంది పేద విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్లు పంపిణీ చేశారు. 15 మంది ఉన్నత విద్యాభ్యాసానికి ఆర్థిక సహాయం అందించారు. వుయ్ హెల్ప్ యూ సంస్థ కన్వీనర్‌గా పనిచేస్తూ వైద్య, విద్య అవసరాలకు తనమిత్రులతో కలిసి సాయం చేస్తున్నారు. ఇదే సంస్థ ద్వారా కరోనా సమయంలో రూ.4లక్షల విలువ చేసే పీపీఈ కిట్లు, వరదల సందర్భంగా రూ.4లక్షల నిత్యావసరాలు, ఇతర సామగ్రి అందించారు. కమలాపూర్ పాఠశాలలో రూ.2లక్షల సుందరీకరణ పనులు చేయించారు. పేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. గణేశ్‌ను ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేయడంపై బీర్‌పూర్ ఎంఈవో నాగభూషణం, ఉపాధ్యాయులు అభినందించారు.

రసాయన శాస్త్రంలో పరిశోధనలు



నీలి వాసవి

జగిత్యాల: నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన నీలి వాసవి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈమె రసాయన శాస్త్రంలో చేసిన 15 పరిశోధనలు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ప్రచురితం అయ్యాయి. ప్రొఫెసర్ నసీం పర్యవేక్షణలో భూగర్భజలాలు, నేలపై ఘనవ్యర్థాలు అంశంపై పరిశోధన చేసి తెలుగు విశ్వవిద్యాలయం నుంచి పట్టా పొందారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సులభంగా వివరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆమె సేవలను గుర్తించిన ప్రభుత్వం ఉత్తమ అధ్యాపక పురస్కారానికి ఎంపిక చేసింది. ఆమెను కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ, ప్రమోద్‌కుమార్, చంద్రయ్య, సంగీత రాణి, వరప్రసాద్, డాక్టర్ సురేందర్‌రెడ్డి అభినందించారు.

ఆకట్టుకునేలా పాఠాలు



శివకృష్ణ

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి మోడల్ స్కూల్ జువాలజీ ఉపాధ్యాయుడు చిలుకూరి శివకృష్ణ 2014లో పెద్దపల్లి జిల్లా ధర్మారంలో విధుల్లో చేరారు. అప్పటినుంచి విద్యార్థులను ఆకట్టుకునేలా బోధిస్తున్నారు. రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్లలో విద్యార్థులు బహుమతులు పొందేలా కృషి చేస్తున్నారు. స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్-2022లో రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి, 2023లో టాప్ 10లో నిలిచారు. ఇన్‌స్పైర్ అవార్డుల్లో నాలుగుసార్లు రాష్ట్రస్థాయి, నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ (ఎన్‌సీఎస్‌సీ)లో ఒకసారి సాధించారు. జవహర్‌లాల్ నెహ్రూ సైన్స్ అండ్ మ్యాథ్స్ ఎగ్జిబిషన్ (ఆర్‌బీవీపీ)లో విద్యార్థులు పాల్గొనేలా కృషి చేశారు. గతంలో పెద్దపల్లి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. ఈయన టెక్ మహీంద్ర, సైన్స్ అకాడమీ నుంచి ట్రాన్స్‌ఫార్మింగ్ ఎడ్యుకేషన్ అవార్డు, తెలంగాణ ఇన్నోవేషన్‌సెల్ (టీఎస్ఐసీ) విలేజ్ ఇన్నోవేటర్ అవార్డు అందుకున్నారు. హర్యానాలో జరిగిన ఇండియన్ ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎడ్యుకేషన్‌లో ఇంటర్నేషనల్ పబ్లికేషన్ విడుదల చేశారు. శివకృష్ణను పాఠశాల ప్రిన్సిపల్ సరిదిదేవి, వైస్ ప్రిన్సిపల్ నగేశ్, ఉపాధ్యాయులు అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ సత్యప్రసాద్



ఆస్పత్రిని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాలరూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం కల్లెడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగులకు కావాల్సిన మందులు అందుబాటులో ఉంచుకోవాలని వైద్యులను ఆదేశించారు. ఇన్‌పేషెంట్లకు సత్వర సేవలందించాలని, అవుట్‌పేషెంట్లలో వ్యాధి లక్షణాలున్న ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా పరీక్షలు నిర్వహించాలని, రోగి లక్షణాలను రికార్డు చేయాలన్నారు. ముందస్తుగా వ్యాధి నిర్ధారణ జరిగితే మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. వైద్యులు ఆస్పత్రి సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ల్యాబ్‌లో వైద్య పరీక్షల వివరాలను, స్టాఫ్ అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. ఫార్మసీ విభాగంలో అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా..? లేదా..? తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, రూరల్ తహసీల్దార్ వరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా పూర్తి చేయాలి

ధర్మపురి: గణపతి నిమజ్జనాన్ని శాంతియుతంగా నిర్వహించుకునేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ధర్మపురిలోని గోదావరి తీర ప్రాంతాలను గురువారం పరిశీలించారు. నిమజ్జనంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఏర్పాట్లు చేయాలని, విగ్రహాలను లోనికి తీసుకెళ్లడానికి సరిపడా తెప్పలను సమకూర్చుకోవాలని ఆదేశించారు. రద్దీని నియంత్రించడం, ప్రజల భద్రత వంటి అంశాలపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. శానిటేషన్, హెల్త్ క్యాంపులు, మంచినీటి సౌకర్యాలు తదితర వాటిని ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. నిమజ్జనం సమయంలో భారీ విగ్రహాలు తీసుకెళ్లే వారికి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులున్నారు.

పంట దెబ్బతిన్న ప్రాంతాల్లో శాస్త్రవేత్తల పర్యటన



పత్తి పంటను పరిశీలిస్తున్న పొలాస శాస్త్రవేత్తలు

జగిత్యాలఅగ్రికల్చర్: పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో పొలాస శాస్త్రవేత్తల బృందం గురువారం పర్యటించింది. ఈ మేరకు జగిత్యాల మండలం మోరపల్లి, రాయికల్ మండలం బోర్నపల్లి గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పత్తి, మొక్కజొన్న, కంది, వరి పంటలను పరిశీలించారు. గోదావరి బ్యాక్ వాటర్‌తో 3 నుంచి 4 రోజులు పూర్తిగా పత్తి పంట నీటిలోనే ఉండటంతో.. పత్తి పంట నష్టం ఎక్కువగా ఉన్నట్లు తేల్చారు. దాదాపు 200 ఎకరాల్లో పత్తికి తీవ్ర నష్టం జరిగినట్లు అంచనా వేశారు. ఈ సందర్భంగా అధిక వర్షాలకు పంట నష్టం జరుగకుండా ఎలా కాపాడుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు స్పందన భట్, రవి, సుమలత, రాజేష్, రామకృష్ణ, బి.శ్రీలక్ష్మి, ఏఈవో నరేశ్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి

మల్లాపూర్: చట్టాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కల్పించాలని నేషనల్ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు నక్క గంగారాం అన్నారు. మండలంలోని నడికుడ పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదుదారు అప్పం చిన్నారెడ్డి సమక్షంలో రికార్డులను తనిఖీ చేశారు. 2017 నుంచి 2025 వరకు రికార్డులు, ఆర్థిక లావాదేవీలు, బిల్లులు, తీర్మానాలు, జనరల్ ఫండ్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను పరిశీలించారు. సమాచార హక్కు చట్టం ప్రజలకు వజ్రాయుధమన్నారు. చట్టాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ ఆర్టీఐ ఆక్టివిస్ట్, సీనియర్ జర్నలిస్టు చుక్క గంగారెడ్డి, ఎన్‌హెచ్‌ఆర్సీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాతారం పద్మ, జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి సంగెపు ముత్తు, పట్టణ అధ్యక్షుడు దేవ్‌సింగ్‌రాథోడ్ పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న ప్రతినిధులు

పింఛన్ల పంపిణీ పారదర్శకంగా చేపట్టాలి



మాట్లాడుతున్న గోపాల్‌రావు

జగిత్యాలజోన్: పింఛన్ల పంపిణీ పారదర్శకంగా చేపట్టాలని గ్రామీణాభివృద్ధి శాఖ పెన్షన్ డైరెక్టర్ గోపాల్ రావు అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ఎంపీడీవోలు, మున్సిపల్, వార్డు, పంచాయతీ కార్యదర్శులు, తపాలా అధికారులతో గురువారం సమీక్షించారు. పేదలకు ప్రభుత్వం వివిధ రకాల పింఛన్లు అందిస్తోందని, అర్హులకు అందేలా చూడాలని తెలిపారు. పోస్టాఫీస్ ద్వారా పంపిణీ సరిగ్గా జరగాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ లత మాట్లాడుతూ.. జిల్లాలో 2,21,847 లబ్ధిదారులకు రూ.48కోట్ల పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ రఘువరణ్ మాట్లాడుతూ.. పోస్టాఫీసు ద్వారా 26,438 పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. సెర్ప్ అదనపు ప్రాజెక్టు అధికారి సునీత, పెన్షన్ అధికారి నాగేశ్వర్ రావు, అయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం



వినాయకుడి శోభాయాత్రలో వేషధారణలో యువకులు

మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి మండలంలో వినాయక నిమజ్జనోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. శోభాయాత్రలో యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పలువురు వివిధ వేషధారణలో సందడి చేశారు.



వెల్లుల్లలో వినాయక విగ్రహాల శోభాయాత్ర

ప్రతీ పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తాం

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ



ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు అందిస్తున్న మంత్రి అడ్లూరి

గొల్లపల్లి: రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పేదలకు మొదటి ప్రాధాన్యం ఇస్తూ.. విడతల వారీగా ఇళ్లు కేటాయించి నిధులు సమకూర్చుతామని తెలిపారు. మండలంలోని లొత్తునూర్ గ్రామంలో 20 మంది లబ్ధిదారులకు ప్రొసిడింగ్ పత్రాలు అందించారు. కొందరి ఇళ్లకు ముగ్గుపోశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటను 200 యూనిట్ల ఉచిత కరెంట్, ఉచిత ఆర్టీసీ ప్రయాణం, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, 50వేల ఉద్యోగాల కల్పన వంటి సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు పేర్కొన్నారు. ఇసుక, ఇనుము, సిమెంట్ ధరలు తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పేదలకు మేలు చేస్తుంటే ఓర్వలేక బీఆర్ఎస్, బీజేపీ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ పార్టీ కుటుంబ ఆస్తి తగాదాల్లోనే చిక్కుకుపోయిందని ఎద్దేవా చేశారు. అనంతరం గ్రామంలోని వంతెన పరిశీలించి నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో సాగుకు పెద్దపీట

- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత



పొరండ్ల చెరువును పరిశీలిస్తున్న దావ వసంత

జగిత్యాలరూరల్: కేసీఆర్ పాలనలో సాగునీటి రంగానికి పెద్దపీట వేశారని, మిషన్ కాకతీయ ద్వారా వేలాది చెరువులకు మరమ్మతు చేయించారని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొరండ్లలోని ఊర చెరువును గురువారం పరిశీలించారు. చెరువు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరడంతో కొందరు రైతుల పంటలు మునిగి నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం చెరువుకు మరమ్మతు చేపట్టి షటర్లు బిగించాలని కోరారు. ఆమె వెంట జగిత్యాల సింగిల్ విండో చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, నాయకులు ఆనందరావు, మహేశ్, కర్నాల శ్రీను, లింగన్న, బాలకృష్ణ, పవన్, రవి, మల్లేశం, ప్రశాంత్, లక్ష్మణ్, నరేశ్ పాల్గొన్నారు.

బల్దియా కార్యాలయాన్ని ముట్టడించిన బీజేపీ



బల్దియా కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాలటౌన్: వినాయక నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేయడంలో బల్దియా అధికారులు విఫలమయ్యారని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు గురువారం జగిత్యాల మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు బల్దియా ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. బల్దియా అధికారులు హిందువుల పండుగలను చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు. భారీవర్షాలకు పలు కాలనీల్లో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయని, శోభాయాత్రలో ఇబ్బంది పడాల్సి వస్తుందని అన్నారు. గుంతల్లో మొరం పోయకపోవడం దారుణమన్నారు. రోడ్ల వెంట లైటింగ్ పెట్టకపోవడం సరికాదని పేర్కొన్నారు. బల్దియా డీఈకి వినతిపత్రం అందించారు. నాయకులు గంగాధర్, ఆముద రాజు, సిరికొండ రాజన్న, ఠాకూర్ పవన్‌సింగ్, గడ్డల లక్ష్మి, చెన్నాడి మధురిమ, సాంబారి కళావతి, మమత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రోడ్ల మరమ్మతు చేపట్టండి

- మాజీమంత్రి జీవన్‌రెడ్డి



రాజనగర్‌లో తెగిపోయిన రోడ్లను పరిశీలిస్తున్న జీవన్‌రెడ్డి

రాయికల్: ఇటీవల కురిసిన వర్షాలకు డ్యామేజీ అయిన రోడ్లు, బ్రిడ్జిలకు వెంటనే మరమ్మతు చేపట్టాలని మాజీమంత్రి జీవన్‌రెడ్డి అధికారులకు సూచించారు. మండలంలోని రాజనగర్‌లో తెగిపోయిన రోడ్లను గురువారం పరిశీలించారు. యుద్ధప్రతిపాదికన నిర్మాణ రోడ్లు, బ్రిడ్జిలకు మరమ్మతు చేయించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, నాయకులు లక్ష్మీ, మండ రమేశ్, ఎలిగేటి మహిపాల్‌రెడ్డి, జగదీశ్, రాజేశ్వర్ రెడ్డి, శ్రీను, రవి, రంజిత్, రాజేశ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు భారీకేడ్లు

ప్రమాదాల నివారణకు భారీకేడ్లు ఉపయోగపడతాయని జీవన్‌రెడ్డి అన్నారు. రాయికల్ మండలం అల్లీపూర్‌లో అత్తినేని అనసూయ, రాజన్న ఏర్పాటుచేసిన భారీకేడ్లను ప్రారంభించారు. గ్రామంలో ప్రతి ఆదివారం మార్కెట్ నిర్వహించేలా అధికారులకు సూచించారు.

ఈ పాస్‌తోనే ఎరువులు విక్రయించాలి

- జిల్లా వ్యవసాయశాఖ అధికారి భాస్కర్



ఎరువుల నిల్వలు పరిశీలిస్తున్న డీఏవో

మల్లాపూర్: ఈ-పాస్ ద్వారానే రైతులకు ఎరువులు విక్రయించాలని డీఏవో భాస్కర్ అన్నారు. మండలకేంద్రంతోపాటు సిరిపూర్, ముత్యంపేట, చిట్టాపూర్‌లోని ప్యాక్స్ కార్యాలయాలను పరిశీలించారు. ఎరువుల నిల్వలు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. యూరియా కోసం రైతులెవరూ ఆందోళన చెందవద్దని, అందరికీ అందిస్తామని తెలిపారు. అనంతరం మల్లాపూర్‌లో డిజిటల్ పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏవో లావణ్య, ఏఈవో గజానంద్, ప్యాక్స్ సీఈవోలు రమేశ్, భూమేశ్, రాజేశ్వర్‌రెడ్డి, రవితేజ, రైతులు పాల్గొన్నారు.

జిల్లాకు మోస్తరు వర్ష సూచన

జగిత్యాలఅగ్రికల్చర్: రానున్న ఐదురోజుల్లో జిల్లాలో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త బి.శ్రీలక్ష్మి తెలిపారు. ఈనెల ఏడో తేదీ వరకు అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. 8, 9తేదీల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపారు.

మద్యం షాపులు బంద్

జగిత్యాలక్రైం: వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని జిల్లాలో రెండురోజుల పాటు మద్యం షాపులు మూసివేయనునట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం ఆరు గంటల వరకు అన్ని మద్యం షాపులు, బార్లు, రెస్టారెంట్లు, కల్లు దుకాణాలను మూసివేయనున్నట్లు పేర్కొన్నారు.

యూరియా కోసం రైతుల ధర్నా



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

గొల్లపల్లి: యూరియా కోసం రైతులు మండలకేంద్రంలోని జగిత్యాల-ధర్మారం ప్రధాన రహదారిపై గురువారం ధర్నా నిర్వహించారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటున్నారని ఆందోళన చేపట్టారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. యూరియా ఎప్పుడు వస్తుందో..? షాపుల్లో ఎంత స్టాక్ ఉందో తెలియడం లేదని, వ్యవసాయాధికారులు సమాచారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని ధర్నా విరమింపజేశారు. రైతుల ఆందోళనకు బీజేపీ మండల నాయకులు మద్దతు తెలిపారు.

క్లుప్తంగా

మావోల తల్లి మృతి


గోపగాని కొమరమ్మ (ఫైల్)

హుజూరాబాద్: మావోయిస్టులు గోపగాని ఐలన్న, కుమారస్వామి తల్లి గోపగాని కొమరమ్మ(92)మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో గురువారం ఉదయం మృతి చెందారు. కొమరమ్మకు ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె. గోపగాని ఐలన్న, గోపగాని కుమరస్వామి నాటి పీపుల్స్‌వార్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారు. కుమారస్వామి 1979లో కమలాపూర్ మండలం గూడూరులో ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. దళంలో పనిచేస్తున్న సమయంలోనే గ్రామైట్ ప్రమాదంలో మృతి చెందాడు. ఐలన్న పీపుల్స్ వార్ పార్టీ ఉత్తర తెలంగాణ రీజనల్ కార్యదర్శిగా పనిచేస్తున్న సమయంలో కిడ్నా పింగ్‌కు గురై 37 ఏళ్లు దాటినా ఆచూకీ లభించలేదు. కుమారుడి ఆచూకీ ఎదురుచూసిన తల్లికి చివరికి నిరాశే మిగిలి మృతి చెందింది.

బావిలో పడి వృద్ధురాలు..


అల్వాల లచ్చమ్మ (ఫైల్)

తిమ్మాపూర్: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి వృద్ధురాలు మృతిచెందింది. తిమ్మాపూర్ మండలం ఇందిరానగర్‌కు చెందిన అల్వాల లచ్చమ్మ (80) గురువారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. సాయంత్రం గ్రామంలోని ఓ రైతు వ్యవసాయ బావిలో మృతిచెంది కనిపించింది. ఎల్ఎండీ పోలీసులు మృతురాలిని లచ్చమ్మగా గుర్తించారు.

చెరువులో స్నానం చేస్తూ వ్యక్తి గల్లంతు


అనిల్ (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్: అంత్యక్రియలకు వెళ్లి చెరువులో స్నానం చేస్తూ వ్యక్తి గల్లంతైన ఘటన మండలంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. మండలంలోని పందిల్లకు చెందిన దబ్బెట రాధ కరీంనగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, గురువారం స్వగ్రామంలో అంత్యక్రియలు చేశారు. అనంతరం చెరువులో స్నానానికి వెళ్లిన ఆదే గ్రామానికి చెందిన దబ్బెట అనిల్ (31) ఈత కొడుతూ గల్లంతయ్యాడు. స్థానిక మత్స్యకారులు గాలించినా ఫలితం లేదు. మృతుడికి భార్య ఉమ, కూతుర్లు అన్విత, వినూత్న, తండ్రి రాజయ్య ఉన్నారు.

వికలాంగురాలిపై లైంగిక వేధింపులు

జూలపల్లి: మానసిక వికలాంగురాలిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. మండలానికి చెందిన మానసిక వికలాంగురాలిపై కొప్పుల మహేందర్ గత నెల 30న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లోకి ప్రవేశించి లైంగిక వేధింపులకు గురిచేసినట్లు బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

వినూత్నం.. విజ్ఞానం

పాఠ్యపుస్తకాల్లోని సిలబస్ పూర్తి చేయడమే పరమావధిగా పనిచేస్తున్న నేటి కాలంలో కొందరు ఉపాధ్యాయులు వినూత్న రీతిలో విద్యాబోధన చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కొందరు పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేయగా.. ఇంకొందరు నిరుద్యోగులకు అండగా ఉంటూ ఉద్యోగాన్వేషణలో బాసటగా నిలుస్తున్నారు.. పలువురు విద్యాభ్యాసం వయసుతో కుదిరిని కాదని నిత్య విద్యార్థిగా అధ్యయనం చేయాలంటూ ముందుకెళ్తున్నారు.. మరికొందరు విద్యార్థుల్లో సామాజిక సేవ దృక్పథం నింపేందుకు తమవంతు కృషిలో ప్రయత్నిస్తున్నారు.. శుక్రవారం ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా కథనాలు..

ప్రయోగాలతో గుర్తింపు


2023లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న మహేశ్‌చంద్ర

ఇల్లంతకుంట(మానకొండూర్): లో కాస్ట్.. నో కాస్ట్ మెటీరియల్స్‌తో విద్యార్థులచే ప్రయోగాలు చేయిస్తూ జిల్లా, రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు ఇల్లంతకుంట హైస్కూల్ బయాలజీ టీచర్ వుడుత మహేశ్‌చంద్ర. ఇప్పటి వరకు విద్యార్థులతో 760 ప్రాజెక్టులు తయారు చేయించారు. 2002లో సైన్స్‌టీచర్‌గా విధుల్లో చేరారు. ఇల్లంతకుంట స్కూల్లో ఎనిమిదేళ్ల నుంచి పనిచేస్తున్నారు. 2023లో రాష్ట్ర, 2019లో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వరించాయి. అలాగే విద్యార్థులతో ప్రయోగాలు తయారు చేయించి జిల్లా, రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో గోల్డ్, సిల్వర్, ఉత్తమ ప్రశంసాపత్రాలు అందుకునేలా చేశారు.

రైలుబడి మాస్టారు


అక్షరాభ్యాసం చేయిస్తున్న రవీందర్‌రెడ్డి

ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బద్దం రవీందర్‌రెడ్డి 2025– జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. 2002లో విధుల్లో చేరి, రెండేళ్లుగా కందికట్కూర్‌లో పని చేస్తున్నారు. పాఠశాలలో గతేడాది 20 మంది విద్యార్థులు ఉండగా వేసవి సెలవుల్లో ఇంటింటా తిరిగి సంఖ్య 40 మందికి పెరిగేలా కృషి చేశారు. గ్రామస్తుల సాయంతో స్కూల్ భవనాన్ని రైలు థీమ్ పాఠశాలగా తీర్చిదిద్దారు. మెరుగైన విద్య అందించడంతోపాటు విద్యార్థులచే పలు యాక్టివిటీస్ చేయిస్తుంటారు.

సౌకర్యాలు కల్పిస్తూ..


కంప్యూటర్ తరగతుల పర్యవేక్షణలో హెచ్ఎం

సిరిసిల్లఎడ్యుకేషన్: పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచుతూ, సౌకర్యాలు కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు హెచ్ఎం చకినాల శ్రీనివాస్. సిరిసిల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా 2018లో విధుల్లో చేరారు. అప్పుడు ఉన్న విద్యార్థులు 31 మంది కాగా ప్రస్తుతం 306కు చేరింది. రెండేళ్లుగా పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. పాఠశాలలో వసతుల కల్పనకు పూర్వ విద్యార్థులతో డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, సీసీ కెమెరాలు, వాటర్ ఫిల్టర్ ఏర్పాటుకు కృషి చేశారు. విద్యార్థుల సౌకర్యార్థం పలువురి సైకిళ్లు అందజేశారు. విద్యార్థులను తమ బడికి రప్పించేలా వేసవి సెలవుల్లో ఉచిత కంప్యూటర్ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి మన్ననలు పొందారు. 2022లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. విద్యార్థుల ప్రవేశాలను గణనీయంగా పెంచి, మెరుగైన ఫలితాలు సాధిస్తున్న గణాంకాల ప్రాతిపదికన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రత్యేక చొరవతో ఈ ఏడాది జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పని చేసుకుంటూ పోతే అవార్డులు రివార్డులు వస్తుంటాయని, విద్యార్థులకు మరింత మెరుగైన బోధన అందించేందుకు మద్రాస్ ఐఐటీతో అవగాహన కల్పించడం సంతోషంగా ఉందన్నారు.

నిత్య విద్యార్థిగా..


పెన్ బ్యాంక్ ఏర్పాటులో మహేందర్‌రెడ్డి

తాను పనిచేసే బడిలో సౌకర్యాల కల్పనకు ప్రయత్నిస్తూనే నిత్య విద్యార్థిగా వందల సంఖ్యలో ఆన్‌లైన్ కోర్సులు చేస్తూ ముందుకెళ్తున్నారు సిరిసిల్ల పట్టణం శివనగర్ కుసుమరామయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ ఇంగ్లిష్ టీచర్ పాతూరి మహేందర్‌రెడ్డి. 1996లో ఉపాధ్యాయ వృత్తిలో చేరిన పాతూరి పని చేసిన ప్రతీ స్కూల్‌లో అంకితభావంతో విద్యార్థుల సంఖ్య పెంచారు. పదో తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు తన తండ్రి పేరిట గోల్డ్, సిల్వర్ మెడల్స్ అందించారు. విద్యార్థుల్లో మానవతా విలువలు, మంచి లక్షణాలను పెంపొందించే ఉద్దేశంతో పాఠశాలలో నిజాయితీ దుకాణం, మానవత్వపు గోడ, పెన్ బ్యాంకులను ప్రవేశపెట్టి పిలలను ప్రోత్సహించారు. మానవతా సేవలు అందిస్తున్న మహేందర్‌రెడ్డి ఇప్పటికే ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కాగా, రెండురోజుల క్రితం తెలుగు యూనివర్సిటీ నుంచి ఉత్తమ ఉపాధ్యాయ కీర్తిపురస్కారాన్ని అందుకున్నారు. జ్ఞానాన్ని పెంచుకునేందుకు ఏ వయసులోనైనా చదువుకోవచ్చని పేర్కొన్నారు.

గూగుల్ కన్నా గురువే మిన్న


విద్యార్థులకు గణితం బోధిస్తున్న అనిత

జ్యోతినగర్(రామగుండం): ప్రస్తుతం ఏదైనా ప్రశ్నకు సమాధానం కావాలంటే గూగుల్‌ను సంప్రదిస్తున్నారు. కానీ, గూగుల్ కంటే గురువే మిన్న అని అన్నారు ఎన్టీపీసీ రామగుండం దుర్గయ్యపల్లి ప్రభుత్వ పాఠశాల మ్యాథ్స్ టీచర్ కె.అనిత అన్నారు. పలు గణితపరికరాలు తయారు చేసి విద్యార్థులకు వినూత్న రీతిలో బోధిస్తున్నారు. శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా 2024లో ఎస్‌సీఈఆర్టీ హైదరాబాద్ నందు నిర్వహించిన రాష్ట్రస్థాయి గణిత సెమినార్‌లో పలకో ధన పత్రం సమర్పించినందుకు స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరసింహారెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు. విద్యార్థులకు నేర్పు కోవాలనే తపన ఉండాలని పేర్కొన్నారు. గూగుల్ మనం ఏది అడిగితే ఆ జవాబు ఇస్తుంది కానీ.. గురువు అది తప్పా, ఒప్పా చెప్పి సరైన మార్గంలో వెళ్లేలా దిశానిర్దేశం చేస్తారని తెలిపారు.

పేద విద్యార్థుల మాస్టారు.. గంగాధర్


సోము గంగాధర్

కోరుట్ల: కోరుట్ల పట్టణానికి చెందిన సోమ గంగాధర్ పేద విద్యార్థుల మాస్టారుగా పేరు సంపాదించారు. కథలాపూర్ మండలం తొంబర్రావుపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 2002లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టాడు. అక్కడ పేద విద్యార్థులను పాఠశాలకు తీసువచ్చి చదువు చెప్పాడు. విద్యాకమిటీ ప్రోత్సాహంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచారు. మెట్‌పల్లి మండలం ఆరపేటలో గణిత బోధన చేసి, మంచి శిక్షణ మాస్టార్‌గా పేరు సంపాదించారు. ప్రస్తుతం ఎంపీపీఎస్ అయ్యప్పగుట్ట పాఠశాలలో పని చేస్తున్నారు. పేద విద్యార్థులను అక్కున చేర్చుకుని, పుస్తకాలు, కాపీలు, పెన్నులు, బ్యాగులతోపాటు ఆర్థిక సాయం అందించి చదువుకునేందుకు సహకరించారు.

గణిత మాస్టారు..నాగరాజు


కాచర్ల నాగరాజు

కోరుట్లటౌన్: కోరుట్ల పట్టణానికి చెందిన కాచర్ల నాగరాజు గణిత మాస్టారుగా విద్యార్థుల్లో ప్రత్యేక స్థానం సంపాదించాడు. 1996లో టీచరు ఉద్యోగం సాధించాడు. గణితం సులువుగా చేయడంపై మెళకువలు నేర్పడం, పోటీ పరీక్షల్లో లెక్కలను ఈజీగా తక్కువ సమయంలో చేసే పద్ధతులపై విద్యార్థులకు నిరంతరం శిక్షణ ఇచ్చి మంచి పేరు సంపాదించారు. ప్రస్తుతం కోరుట్ల మండలం పైడిమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గణిత బోధకుడిగా పని చేస్తున్నాడు

బోధన.. సమాజంపై బాధ్యత


పాఠశాలలో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేసిన నాగభూషణం

మల్యాల(చొప్పదండి): చదువులో వెనకబడిన వారిని గుర్తించి, వారి సామర్థ్యానికి అనుగుణంగా బోధన చేస్తూ, విద్యార్థులకు మార్గదర్శిగా నిలుస్తున్నారు ఉపాధ్యాయుడు దొంతుల నాగభూషణం. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిలో నాగభూషణం ఒకరు. 2022 నుంచి మల్యాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులకు తాగునీరు అందుబాటులో లేకపోవడంతో సమీప బంధువుల సాయంతో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేయించారు.

'ఇగురం'గా బోధిస్తూ..


నరేశ్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

మండలంలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న కపిల నరేశ్ విద్య బోధన చేస్తూనే, నిరుద్యోగులకు అండగా ఉంటి, పోటీ పరీక్షల్లో నెగ్గేందుకు అవసరమైన మెలకువలను 'ఇగురం' యూట్యూబ్ చానల్‌లో అందిస్తున్నారు. ప్రస్తుతం చందుర్తి మండలంలో పోస్టింగ్ రావడంతో తన కూతురును అదే పాఠశాలలో చదివించేందుకు ప్రవేశం తీసుకుని ఆదర్శంగా నిలిచారు. తన జీవన గమనానికి ఆర్థిక వనరులు అందిస్తున్న ప్రభుత్వ బడిని దక్కించుకునేందుకు తన కూతురిని ప్రభుత్వ బడిలో చేర్పించినట్లు తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా విద్యాశాఖ నుంచి అవకాశాలు రానప్పటికీ వివిధ సంస్థల 2 రాష్ట్రస్థాయి అవార్డులతో పాటు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశాయి.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వీడియోలతో..


ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వీడియో ఆధారంగా ప్రశంసల కోసం తర్ఫీదు ఇస్తున్న సత్యనారాయణ

క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా వట్టిమల జెడ్పీ స్కూల్ గెజిటెడ్ హెచ్ఎం కర్ర సూర్యనారాయణ కృషి చేస్తున్నారు. బడిబాటలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వీడియోను ప్రచారం చేసి ఆకర్షణగా నిలిచారు. ప్రభుత్వ నిర్ణయానికి ముందే పాఠశాలను ఆంగ్ల మాధ్యమ స్కూల్‌గా మార్చి ఇంగ్లిష్ మీడియం బోధన ప్రారంభించారు. సిరిసిల్ల టీచర్ వెల్ఫేర్ ద్వారా హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు ఉపయుక్తమైన సమాచారం అందిస్తున్నారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రధానోపాధ్యాయుడు, అంతర్జాతీయంగా గ్లోబల్ టీచర్ అవార్డు అందుకున్నారు.

కొడుకు, కోడలు ఇంటి నుంచి గెంటేశారని..


వృద్ధురాలిని చేరదీస్తున్న సఖీ నిర్వాహకులు

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామానికి చెందిన వృద్ధురాలు తన కొడుకు, కోడలు ఇంటి నుంచి గెంటేశారని, భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్నానని, తనకు సంరక్షణ కల్పించాలని సంక్షేమాధికారి కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కిష్టమ్మను మూడు రోజుల క్రితం కొడుకు, కోడలు ఇంటి నుంచి గెంటేశారు. విద్యానగర్‌లోని రామాలయం వద్ద కాలం వెళ్లదీస్తోంది. స్థానికులు ఆమె పరిస్థితిని సంక్షేమ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో సఖీ కేంద్రం నిర్వాహకులు ఆమెను గురువారం సాయంత్రం చేరదీసి కౌన్సెలింగ్ నిర్వహించారు. తన పేరున ఉన్న ఇల్లును కొడుకు పేరిట చేసుకుని ఇప్పుడు పోషించడం లేదని అధికారులకు వివరించింది.

చిట్టీ డబ్బులతో ఉడాయించిన వ్యక్తిపై కేసు

కోరుట్ల రూరల్: మండలంలోని పైడిమడుగుకు చెందిన గుగ్గిళ్ల రమేశ్ చిట్టీల పేరుతో డబ్బులు వసూలు చేసి పారిపోయినట్లు అదే గ్రామానికి చెందిన ఆడెపు రవిచందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్సై చిరంజీవి కథనం ప్రకారం గుగ్గిళ్ల రమేశ్, ఆయన భార్య గాయత్రి చిట్టీల పేరుతో గ్రామంలో పది మంది నుంచి రూ.32.57లక్షలు వసూలు చేశారు. వాటిని తిరిగి ఇవ్వకుండా గ్రామం నుంచి పారిపోయారు. రవిచందర్ ఫిర్యాదు మేరకు రమేశ్, గాయత్రిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. గ్రామంలో సుమారు రూ.కోటిన్నర వరకు రమేశ్ చిట్టీల పేరిట వసూలు చేసి తిరిగి ఇవ్వలేదని గ్రామస్తుల ద్వారా తెలిసింది.

ఎస్జీఎఫ్ అండర్–19 కార్యదర్శిగా మధు జాన్సన్


మధు జాన్సన్

కరీంనగర్‌స్పోర్ట్స్: జూనియర్ కళాశాల క్రీడా సమాఖ్య (ఎస్జీఎఫ్) ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా గుమ్మడి మధు జాన్సన్ నియమితులయ్యారు. కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ జూనియర్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న మధు జాన్సన్‌ను 2025–26 సంవత్సరానికి క్రీడా సమాఖ్య కార్యదర్శిగా నియమిస్తూ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గంగాధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మధు జాన్సన్‌ను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సత్యవర్ధన్‌రావు, ఆంజనేయరావు, వెంకటరమణ, జనార్దన్, శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

సురవరం ఆశయాలు, లక్ష్యాలు కొనసాగించాలి

- మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి


నివాళి అర్పిస్తున్న చాడ, పంజాల శ్రీనివాస్, నారదాసు లక్ష్మణ్‌రావు, నరేందర్‌రెడ్డి తదితరులు

కరీంనగర్: పేద ప్రజల పక్షపాతిగా, ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మహోన్నతమైన గొప్ప కమ్యూనిస్టు యోధుడిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న వ్యక్తి సురవరం సుధాకర్‌రెడ్డి అని, ఆయన ఆశయాలు, లక్ష్యాలను కొనసాగించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం కరీంనగర్‌లోని ఫిల్మ్ భవన్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సురవరం సంస్మరణ సభలో పలువురు నేతలు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. నివాళి అర్పించి మౌనం పాటించారు. మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. సుధాకర్‌రెడ్డి మృతితో దేశం రాజకీయంలో అత్యంత బాధాకరమని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలవేన శంకర్ మాట్లాడుతూ.. పేదల సమస్యలపై అనేక పోరాటాలు చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వుట్కూరి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. నేటితరం యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహ ఆలపించిన విప్లవ గేయాలు ఆలోచింపజేశాయి. సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, కసిరెడ్డి మణికంఠరెడ్డి, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు గూడెం లక్ష్మి, బత్తుల బాబు, నాగెల్లి లక్ష్మారెడ్డి, పిట్టల సమ్మయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉమ్మెంతల రవీందర్‌రెడ్డి, బండ రాజిరెడ్డి, కటకంరెడ్డి బుర్రన్నయాదవ్, బోయిని అశోక్, సిరిసిల్ల మల్లేశం, చైతన్యవేదిక రాజు, చాడ శ్రీధర్‌రెడ్డి, అందె చిన్నస్వామి, నాగులపెట్టి రాజు, కంది రవీందర్‌రెడ్డి, బీర్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు. దయ్య, కొట్టె అంజలి, బామండ్లపెల్లి యుగేందర్,

గురుకుల విద్యార్థినులకు అస్వస్థత

- వైద్యపరీక్షలు నిర్వహించిన పీహెచ్‌సీ సిబ్బంది


వైద్య పరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

గంభీరావుపేట(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయం విద్యార్థులు బుధవారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. పలువురు విద్యార్థులకు మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో బుధవారం రాత్రి వైద్యం అందించారు. గురువారం ఉదయం లింగన్నపేట పీహెచ్‌సీ అధికారులు, సిబ్బంది పాఠశాలలో విద్యార్థులకు వైద్యపరీక్షలు చేశారు. 446 మందికి వైద్యపరీక్షలు చేయగా.. 48 మంది విద్యార్థినులు జలుబు, దగ్గు, చర్మ సంబంధిత వ్యాధులు, కడుపునొప్పి, జ్వరం, పసిరికలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వారికి మందులు అందజేశారు. సీహెచ్‌వో రమేశ్, వైద్య సిబ్బంది భారతి, శిల్ప, హేమలత, కల్పలత, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయపోటీలకు నవోదయ విద్యార్థులు


జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన నవోదయ విద్యార్థులు

చొప్పదండి: జవహర్ నవోదయ విద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఏపీలోని ఒంగోలులో జరిగిన రీజనల్ లెవల్ కళా ఉత్సవ్–2025 పోటీల్లో విద్యాలయం నుంచి పాల్గొన్న గురునాథం వంశీ, ఎం.కార్తికేయ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో ఢిల్లీలో జరిగే పోటీలకు ఎంపికయ్యారు. బాయ్స్ తయారీలో చూపిన ప్రతిభతో మొదటిస్థానంలో నిలిచారు. విద్యార్థులతో పాటు ఆర్ట్ టీచర్ గోకా నాగేశ్వర్‌రావును ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.బ్రహ్మానందరెడ్డి, రాయుడు అభినందించారు.

సహకార సంఘాలకు ఉజ్వల భవిష్యత్


మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ బీఎస్.లత

జగిత్యాలఅగ్రికల్చర్: సహకార సంఘాలకు ఉజ్వల భవిష్యత్ ఉందని అడిషనల్ కలెక్టర్ బీఎస్.లత అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా సహకార అధికారి కార్యాలయంలో పుస్తకం మండి సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాపూర్తిగా వ్యవసాయాధారితం కావడంతో సహకార సంఘాలు రైతులకు అవసరమైన అనేక వ్యాపారాలు చేసుకుని లాభాలు పొందవచ్చని తెలిపారు. జిల్లాలో గోదాములు నిర్మాణానికి ప్రభుత్వం ముందుకొస్తున్న నేపథ్యంలో సహకార సంఘాలు వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ మాట్లాడుతూ.. కొత్త సహకార సంఘాలను ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వపరంగా ప్రోత్సాహం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ జనరల్ మేనేజర్ రవిప్రకాశ్, జెడ్పీ సీఈవో గౌతంరెడ్డి, కరీంనగర్ సహకార బ్యాంక్ సీఈవో సత్యనారాయణరావు, డీపీవో భాస్కర్, పౌరసరఫరాల శాఖ అధికారి జితేందర్ పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో జీవితఖైదు

పెద్దపల్లిరూరల్/ఓదెల: లైంగిక దాడికి పాల్పడ్డ కేసులో నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ.21వేల జరిమానా విధిస్తూ పెద్దపల్లి పోక్సో స్పెషల్ కోర్టు న్యాయమూర్తి కుందారం సునీత గురువారం తీర్పు చెప్పారు. ఓదెల మండలం ఉప్పరపల్లిలో శిలారపు రమేశ్ అదే గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చిన బాలికపై 2 జూన్ 2022 రోజున లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పొత్కపల్లి పోలీసులు అప్పటి ఎస్సై లక్ష్మణ్ కేసు నమోదు చేశారు. న్యాయమూర్తి సునీత కేసు పూర్వాపరాలను పరిశీలించిన బాధితురాలికి పునరావాసం కింద రూ.5లక్షలు ఇప్పించాలని తీర్పులో పేర్కొన్నారు.

ఎత్తివేసిన రైళ్లకు హాల్టింగ్ పునరుద్ధరణ

- పెద్దపల్లి ఎంపీ ఒత్తిడితో దిగివచ్చిన రైల్వేశాఖ


సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్

రామగుండం: కొవిడ్‌వేళ క్రితం ప్రయాణికుల నుంచి ఆశించిన స్పందన లేదనే కారణంతో పాటు దాని ముందు ఒక రైలుకు హాల్టింగ్ కల్పించాలని సాకు, వీటన్నింటి కంటే పలు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఎంపిక వైపు వెళ్లే క్రమంలో హాల్టింగ్, దిగువ వైపు వెళ్లే వాటికి నాన్‌స్టాప్ ఇలా గందరగోళంగా ఆధ్వర్యం కాని నిర్ణయాలను తీసుకున్న మధ్య రైల్వే అమలు చేసింది. దీంతో రామగుండం కేంద్రంగా రాకపోకలు సాగించే ప్రయాణికులు రైల్వేశాఖ నిర్ణయంపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమయ్యాయి. కాగా పలుమార్లు పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ రైల్వే జీఎం దృష్టికి తీసుకెళ్లి 11 రైళ్లకు హాల్టింగ్స్ కల్పించాలని కోరగా కేవలం ఐదు రైళ్లకు మాత్రమే హాల్టింగ్ కల్పించినట్లు పేర్కొన్నారు. పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో రెండు రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని కోరగా కేవలం ఒక రైలుకు మాత్రమే హాల్టింగ్ కల్పించారు. గురువారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ హాల్టింగ్ కల్పించిన రైళ్ల వివరాలను ఒక ప్రకటనలో వెల్లడించారు. హాల్టింగ్ కల్పించడంపై ప్రయాణికుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

రామగుండంలో హాల్టింగ్ కల్పించిన రైళ్ల వివరాలు..

రైలు నం.12295 బెంగళూరు–దానాపూర్ (సంఘమిత్ర సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్)

రైలు నం.12578 దర్భంగా–మైసూర్ (బాగ్‌మతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్)

రైలు నం.12721 హైదరాబాద్–హజ్రత్ నిజాముద్దీన్ (దక్షిణ్)

రైలు నం.22535 రామేశ్వరం–బనారస్ (రామేశ్వరం)

రైలు నం.22669 ఎర్నాకులం–పాట్నా (పాట్నా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్)

పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో రైలు నం.12722 దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్ కల్పించారు.